నేడు పజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఫిర్యాదులు స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు.

కిక్కిరిసిన శ్రీశైలం





నిత్య కళారాధనలో చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శన

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ముగిసిన కార్తీక మాసోత్సవాలు

శ్రీశైలం, డిసెంబరు 1: (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం పురస్కరించుకుని ఆదివారం క్షేత్రానికి పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో క్షేత్ర పురవీధులన్నీ భక్తులతో రద్దీగా దర్శనమిచ్చాయి. భక్తులు వేకువజాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో బారులుదీరారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో స్వామివారి అలంకరణ దర్శనం కల్పించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయ ఉత్తర వీధి ప్రాంగణం, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద విశేష పూజలు నిర్వహించుకుని దీపారాధనలు జరిపారు. ఆలయ అధికారులు క్యూలైన్లలో వేచివున్న భక్తులకు మంచినీళ్ళు, బిస్కెట్లు, అల్పాహారం అందజేశారు. సాయంత్రం స్వామివారికి పల్లకీ ఉత్సవం, ఆకాశదీపం కార్యక్రమాలను నిర్వహించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ధర్మపథంలో భాగంగా దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధనలో ఆదివారం సాయంత్రం ఖమ్మం జిల్లాకు చెందిన అభినందన రుద్ర నాట్యాలయం విద్యార్థులు సాంస్కృతిక నృత్యప్రదర్శన నిర్వహించారు. శివాష్టకం, మహిషాసుర మర్దిని, శివ తాండవం, శంభో శివ శంభో, ఓం నమఃశివాయ తదితర శైవ గీతాలకు రిధి, శైశాలి, జయకీర్తన, భవిష్య వర్ధిని, ఆరాధ్యశ్రీ, నిత్యశ్రీ, యశస్విని తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.



క్యూలైన్లలో వేచిఉన్న భక్తులు



దీపరాధనలు చేస్తున్న మహిళలు



స్వామి, అమ్మవార్ల పల్లకి సేవ

ప్రజా సమస్యలను పరిష్కరించండి

అధికారులకు మంత్రి బీసీ ఆదేశం



దరఖాస్తులు స్వీకరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం బనగానపల్లెలో ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా వచ్చిన వారితో మంత్రి అర్జీలను స్వీకరించారు. బాధిత ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి అప్పటికప్పుడు పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఎక్కువగా రెవెన్యూ సమస్యలు మంత్రి దృష్టికి రాగా వాటిని పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చాలి: కలెక్టర్



ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నంద్యాలను ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చాలని కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నివారణదినం సందర్భంగా నంద్యాల పట్టణంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఎయిడ్స్ నివారణకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 84 ప్రభుత్వ వైద్యశాలల్లో రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఏఆర్టీ సెంటర్ల ద్వారా హెచ్‌ఐవీ చికిత్సకు మందులను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందన్నారు. వ్యాధిగ్రస్థులు క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలన్నారు. ఫెసిలిటీ సెంటర్లల్లో వ్యాధిగ్రస్తులకు సకాలంలో మందులు పంపిణీ చేస్తూ ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, ఐసీటీసీ సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్లు నిబంధనలకు చెల్లు..!



- నంద్యాల మున్సిపాలిటీలో జోరుగా అక్రమ నిర్మాణాలు
- అడ్డగోలు కట్టడాలను పట్టించుకోని అధికారులు
- నిబంధనలు కొందరికే అన్నట్టుగా వ్యవహార శైలి
- టౌన్‌ప్లానింగ్ విభాగం తీరుతో విస్తుపోతున్న జనం

నంద్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):

ఇది నంద్యాల పట్టణంలోని ఫరూఖ్ నగర్‌లో నిర్మిస్తున్న ఇల్లు. పంట కాలువను ఆక్రమిస్తూ ఈ ఇంటి నిర్మాణం చేపడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పైగా దీనికి ఎలాంటి అనుమతుల్లేవని అధికారులే స్వయంగా చెబుతున్నారు. అయినా ఇంటి నిర్మాణం దాదాపు సగానికి పైగా పూర్తయింది. ఇదేమిటని అడిగితే.. ఇంటి నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చామని అధికారులు సమాధానమిస్తున్నారు.

ఇలాంటి నిర్మాణాలు నంద్యాల మునిసిపాలిటీ పరిధిలో కొల్లలుగా ఉన్నాయని తెలుస్తోంది. అధికారులు వీటి వంక కనీసం కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు అన్నింటి పట్ల ఇదేవిధంగా వ్యవహరిస్తున్నారా అంటే అదీ లేదు. చాలా ఇంటి నిర్మాణాలకు సంబంధించి నిబంధనలు సరిగా లేవంటూ అనుమతులు మంజూరు చేయటం లేదు. ఒకే మునిసిపాలిటీ పరిధిలోని కొన్ని నిర్మాణాల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్న అధికారులు, మిగతా వాటిని చూసీ చూడనట్లుగా ఎందుకు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అడిగింది సమర్పించు కోలేని వారి పట్ల ఓ విధంగా, అనుకూలంగా ఉన్న వారి పట్ల మరోవిధంగా వ్యవహరిస్తూ అధికారుల పక్షపాతం చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

కొన్నింటికే ఎందుకు?

ఇంటి నిర్మాణం చేపట్టే యజమానులు సంబంధిత మున్సిపాలిటీ నియమ నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. సెంటున్నర, ఆపైన స్థలంలో ఇంటిని నిర్మించే ప్రతి నిర్మాణదారుడు మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం ఇంటి ప్లానుతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఏ ఒక్క నిబంధన సరిగా లేకపోయినా మున్సిపాలిటీలో ఏసీపీ (అసిస్టెంట్ సిటీ ప్లానర్), టౌన్ ప్లానింగ్ అధికారులు దరఖాస్తును వెనక్కి పంపుతారు. దీనిని షార్ట్‌ఫాల్ అంటారు. ఇలాంటి షార్ట్‌ఫాల్ దరఖాస్తులు నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 200 వరకు ఉన్నట్లు తెలుస్తోంది. అధికారులు తీరుతో షార్ట్‌ఫాల్ దరఖాస్తులకు సంబంధించి నిర్మాణదారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. నిబంధనలు లేవంటూ తమని నెలలుగా తిప్పుతూ అనుమతులు ఇవ్వటం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు సెంటున్నర లోపు ఇళ్ల కట్టుకునే వారి పట్ల కూడా మున్సిపాలిటీ అధికారులు ఇదే తీరుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి సెంటున్నర లోపు స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టే వారు ఎలాంటి అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదు. కానీ బ్యాంకు లోను వస్తుందన్న ఆశతో చాలా మంది పేద, మధ్య తరగతి వారు మున్సిపాలిటీ అనుమతులు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇలాంటి వారి విషయంలో కూడా సంబంధిత మున్సిపల్ అధికారులు దరఖాస్తులను షార్ట్‌ఫాల్‌లో పెడుతున్నట్లు సమాచారం. డబ్బులు దండిగా ఉండి, అడిగినంత ఇచ్చేవారు నిబంధనలను ఉల్లంఘించి కట్టుకుంటున్నా మున్సిపాలిటీ అధికారులు పట్టించు కోవటం లేదని, డబ్బులు సమర్పించుకోలేని పేద, మధ్య తరగతి వారి ఇంటి నిర్మాణ దరఖాస్తులను మాత్రం పెండింగ్‌లో పెడుతూ సతాయిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మిగతా 7లో..

నిబంధనలు కొందరికేనా..?

సాధారణంగా ఇంటి నిర్మాణదారులు అనుమతుల కోసం మున్సిపాలిటీకీ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వీటిని సంబంధిత వార్డు ప్లానింగ్ సెక్రటరీలు అనుమతుల కోసం మున్సిపాలిటీకి పంపించాల్సి ఉంటుంది. దరఖాస్తులను అలా పంపించకుండా వార్డు సచివాలయ పరిధిలోనే నిలిపివేస్తే 15 రోజుల తర్వాత డీమ్డ్‌గా చూపుతాయి. డీమ్డ్ అంటే అనుమతులు నిరాకరించినట్లు కాదు, అలా అని అనుమతులు మంజూరు చేసినట్లు కాదు. దరఖాస్తు చేసుకున్న యజమానులు మాత్రం ఇంటి నిర్మాణాలను చేపడుతున్నారు. అయితే ఇదంతా ఓ పద్ధతి ప్రకారం అధికారులు, సచివాలయ ప్లానింగ్ ఉద్యోగులు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. నిర్మాణ అనుమతుల కోసం చేసుకున్న దరఖాస్తులను అధికారుల సాయంతో సచివాలయ ప్లానింగ్ ఉద్యోగులు పైకి పంపించకుండా నిలిపివేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా కావాలని 15 రోజులు నిలిపివేస్తుండటంతో అవన్నీ డీమ్డ్ కింద పడిపోతాయి. ఇలాంటి డీమ్డ్ దరఖాస్తులు దాదాపు నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 260కి పైగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి డీమ్డ్ దరఖాస్తులుగా ఉన్న వాటికి సంబంధించిన ఇంటి నిర్మాణాలను పరిశీలించి వాటిని అధికారులు నిలిపివేయాల్సి ఉన్నా పట్టించుకోవటం లేదు. ఇలాంటి నిర్మాణాలు ఎక్కువగా మహానంది రోడ్డులోని బంగారుపుట్ట, రైతు నగరం, జగజ్జనని నగర్ వంటి ప్రాంతాల్లో జరుగుతున్నాయని తెలుస్తోంది. మున్సిపాలిటీ నుంచి అనుమతుల్లేకపోయినా వీటి నిర్మాణాలు నిరభ్యంతరంగా ఎలా సాగుతున్నాయనే సందేహాలు వెలువడుతున్నాయి. నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణాలకు అనుమతులు రావు కాబట్టి తామే డీమ్డ్ కిందకు వెళ్లేలా అధికారులే చేయిస్తున్నారని తెలుస్తోంది. అందుకు ప్రతిఫలంగా ఆయా ఇంటి నిర్మాణదారుల నుంచి డబ్బులు దండుకుంటూ అనుమతుల్లేని నిర్మాణాలు కొనసాగేలా సాయం చేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

బెల్టు తీసేదెవరు..?



- ఊరూవాడా బెల్టు షాపులు
- పల్లెసీమల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- టీడీపీ కూటమి నాయకుల అండతో రెచ్చిపోతున్న మద్యం మాఫియా
- నవంబరులో రూ.75 కోట్ల మద్యం అమ్మకాలు
- బెల్టు షాపుల వాటా రూ.25 కోట్ల పైమాటే
- కళ్లకు గంతలు కట్టుకున్న ఎక్సైజ్ నిఘా
- సీఎం చంద్రబాబు హెచ్చరికతోనైనా బెల్టు షాపులకు కళ్లెం వేస్తారా..?

ఆంధ్రజ్యోతి పరిశీలన

దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామ జనాభా దాదాపు పది వేలు. ఇక్కడ 30కి పైగా మద్యం బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. దక్షిణాది ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయంలో రాఘవేంద్రపురం, తుంగభద్ర నది ఒడ్డున రెండు మద్యం బెల్ట్ దుకాణాల్లో మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా యంత్రాంగం ఉండే కర్నూలు నగర శివారుల్లోని వీకర్ సెక్షన్ కాలనీల్లో గల్లీకో బెల్ట్ షాపు.. ఇలా ఒక్కచోట కాదు జిల్లా అంతటా ఇదే పరిస్థితి. పల్లెపల్లెన మద్యం ఏరులై పారుతోంది. టీడీపీ కూటమి ముఖ్య ప్రజాప్రతినిధుల అండదండలు, ఎక్సైజ్ నిఘా కళ్లకు గంతలు కట్టుకోవడం వెరసి ఊరూ, వాడా మద్యం బెల్ట్ షాపులు బార్లా తెరుచుకున్నాయి. మద్యం, ఇసుక, ఎర్రమట్టిలో జోక్యం చేసుకోవద్దని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ వైపు హెచ్చరిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో బెల్ట్ షాపులకు కళ్లెం వేసేదెవరు..? జిల్లాలో మద్యం బెల్ట్‌షాపులపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వెలుగు చూసిన వాస్తవాలపై ఆంధ్రజ్యోతి కథనం.

కర్నూలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వ్యాప్తంగా జిల్లాలో 99 మద్యం దుకాణాలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వమే మద్యం వ్యాపారం చేస్తే.. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక 2019కి ముందు తరహాలో ప్రైవేటు వ్యక్తులకు మద్యం దుకాణాలు అప్పగించింది. రెండేళ్ల లీజుకు దరఖాస్తులు స్వీకరిస్తే 3,046 మంది దరఖాస్తులు చేశారు. రుసుం రూపంలో రూ.60 కోట్లకుపైగా ఖజానాకు ఆదాయం వచ్చింది. లాటరీ ద్వారా మద్యం షాపులు లీజుదారులకు అప్పగించారు. నవంబరు ఒకటో తేదీన లీజుదారులు మద్యం షాపుల్లో అమ్మకాలకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు పోయి.. ప్రైవేటు వైన్స్ వచ్చాయి. కావాల్సిన బ్రాండ్లు కొనుకోవచ్చు. అయితే.. ఎక్కడో ఉన్న లైసెన్స్‌డ్ మద్యం షాపులకు వెళ్లి కొనుక్కునేందుకు ఇబ్బంది పడకుండా.. మద్యం ప్రియులకు అందుబాటులోకే మద్యం అన్నట్లు పల్లెపల్లెన.. వీధివీధిన బెల్ట్ షాపులు బార్లా తెరుచుకున్నాయి. టీడీపీ కూటమి ముఖ్య ప్రజాప్రతినిధులు, వారికి సన్నిహితంగా ఉండే కీలకమైన నాయకుల అండతో ఈ భాగోతం సాగుతున్నట్లు తెలుస్తోంది. మద్యం అమ్మకాలు, బెల్ట్ షాపుల నిర్వహణలో ఈ స్థాయిలో రాజకీయ జోక్యం మునుపెన్నడు చూడలేదని ఎక్సైజ్ శాఖ అధికారి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారంటే ఏ స్థాయిలో విస్తరించారో ఇట్టే తెలుస్తుంది.



ఒక్కో బెల్ట్ షాపునకు ఒక్కో రేటు

కర్నూలు సిటీ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 31, కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 14, ఎమ్మిగనూరులో 15, కోసిగిలో 4, పత్తికొండలో 14, ఆదోనిలో 12, ఆలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 9 లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలు ఉన్నాయి. ఒక్కో మండలంలో ఒకటి రెండు మద్యం షాపులు ఉంటే.. ఏ పల్లెకు వెళ్లినా ఏమున్నది గర్వకారణం.. వీధివీధిన... సందుసందున మద్యం బెల్ట్ షాపులే అన్నట్లుగా మార్చేశారు. ప్రతి పల్లెలో 3 నుంచి 5 బెల్ట్ షాపులు ఉంటే, పెద్ద గ్రామాల్లో 10-15కిపైగా ఉన్నట్లు సమాచారం. ఒక్కో బెల్ట్ షాపునకు ఒక్కో రేట్ చొప్పున మద్యం షాపుల యజమానులు రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు డిపాజిట్ రూపంలో వసులు చేశారు. డిమాండ్ ఉన్న పల్లెల్లో రూ.లక్ష వరకు తీసుకున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఎక్సైజ్ నిఘా అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి షాపు నుంచి నెల మాముళ్లు నిర్ణయించడం, ముఖ్య ప్రజాప్రతినిధులు జోక్యంతో ఎక్సైజ్, పోలీస్ యంత్రాంగం చూసిచూడనట్లు వెళ్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెల్ట్ షాపుల నిర్వహణలో అధికార టీడీపీ కూటమి నేతలతో పాటు ప్రతిపక్ష వైసీపీ నాయకులు ఉండడం కొసమెరుపు.

మిగతా 7లో..

తగ్గుతున్న కృష్ణాజలాలు

- బయల్పడుతున్న సంగమేశ్వర ఆలయ శిఖరం
- శిఖరానికి తొలిపూజలు



నది నుంచి బయల్పడుతున్న సంగమేశ్వర ఆలయ శిఖరం

కొత్తపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సాగు, తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం రిజర్వాయరు నుంచి భారీగా కృష్ణాజలాలు దిగువ ప్రాజెక్టులకు విడుదల చేస్తున్నారు. కృష్ణమ్మ నదీగర్భంలో నాలుగు నెలలుగా నిక్షిప్తమైన సప్తనదుల సంగమేశ్వర ఆలయ శిఖరం ఆదివారం మెల్లమెల్లగా బయల్పడుతోంది. శిఖర దర్శనం ఇవ్వడంతో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ నదిలో మరబోటు ద్వారా సంగమేశ్వర ఆలయ శిఖరం వద్దకు వెళ్లి తొలి పూజలు చేశారు. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, 864.80 అడుగులకు చేరుకుంది. అలాగే రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వలు 215 టీఎంసీలు కాగా.. 121.8310 టీఎంసీలుగా నమోదైంది. దీంతో ఆలయ శిఖరం భక్తులకు దర్శనమిస్తోంది. మహిళలు భారీగా తరలివచ్చి శిఖర దర్శనం చేసుకుని పుణ్య స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు. అలాగే ఎగువ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, సహస్రనామార్చన, కుంకుమార్చన పూజలు చేశారు. అలాగే దిగువకు నీటి విడుదల కొనసాగితే.. వచ్చే సంక్రాంతికి ఆలయం పూర్తిగా బయల్పడే అవకాశం ఉంది.

బెల్టు తీసేదెవరు..?

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ లైసెన్స్ ఉన్న మద్యం షాపులో విక్రయించే ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు బెల్టు షాపులు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం సామాన్యులకు నాణ్యమైన మద్యం తక్కువ ధరకు ఇవ్వాలనే లక్ష్యంగా రూ.99లకే క్వార్టరు లిక్కరు తీసుకొచ్చారు. ఇదే సీసా గ్రామాల్లోని బెల్టు షాపుల్లో రూ.125ల నుంచి రూ.150ల వరకు విక్రయిస్తున్నారు. ఇతర బ్రాండ్ల మద్యం క్వార్టర్ సీసా, బీరు సీసాపై ఎమ్మార్పీ కంటే రూ.15 నుంచి రూ.25ల వరకు అదనంగా వసులు చేస్తున్నారు. ఇదే అదనుగా మంత్రాలయం, ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో కర్ణాటక, తెలంగాణ సరిహద్దు మండలాల్లోని గ్రామాల్లోని బెల్టు షాపుల్లో కర్ణాటక తయారీ, అక్రమ మద్యం (నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్-ఎన్‌డీపీఎల్) విక్రయాలు చేస్తున్నారు. జిల్లాలో సుమారుగా 2 వేలకు పైగా మద్యం బెల్టు దుకాణాలు ఉన్నాయని అనధికారిక సమాచారం. నవంబరు నెలలో అధికారికంగా రూ.75 కోట్ల విలువైన మద్యం 96,330 కేసుల లిక్కరు, 37,676 కేసుల బీరు విక్రయాలు జరిగాయి. అందులో బెల్టు షాపుల్లో ఒక్కటే రూ.25 కోట్లకు పైగా అమ్మకాలు జరిగాయని అంచనా వేస్తున్నారు. అంటే బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు ఏస్థాయిలో జరుగుతున్నాయో తెలుస్తుంది.

సీఎం చంద్రబాబు హెచ్చరికతో బెల్టుకు కళ్లెం పడేనా..?:

'మద్యం మాఫియాను అరికట్టి తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందుబాటులో ఉంచాం.. మద్యం వ్యాపారంలో ఇతరుల జోక్యాన్ని సహించను. బెల్టు షాపులు పెడితే నేను కూడా బెల్టు తీయాల్సి వస్తుంది..' అని అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం నేమకల్లు ప్రజావేదిక సభలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి హెచ్చరికతోనైనా టీడీపీ కూటమి నాయకుల్లో మార్పు వస్తుందా..? ఎక్సైజ్ అధికారుల్లో కదలిక వస్తుందా..? ఊరూవాడా విచ్చలవిడిగా వెలసిన మద్యం బెల్టు షాపులకు తాళం పడుతుందా..? అన్నది ప్రశ్నార్థకమే. కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ కూటమి ముఖ్యమైన ప్రజాప్రతినిధులే జోక్యం చేసుకోవడంతో నిఘా అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నాయకుల తీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని మద్యం వ్యాపారంతో ఎలాంటి సబంధం లేని అధికార కూటమి నాయకులే పేర్కొంటున్నారు.

బెల్టు షాపులపై నిఘా పెడుతున్నాం



గ్రామాల్లో బెల్టు షాపులపై నిఘా పెట్టాం. ఎక్సైజ్ స్థానిక, విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తున్నారు. నవంబరు నెలలో 66 బెల్టు షాపులపై కేసులు నమోదు చేసి 350 లీటర్లు ఐఎంఎల్ మద్యం సీజ్ చేసి 64 మందిని అరెస్ట్ చేశాం. మరో 70 కేసులు నమోదు చేసి కర్ణాటకలో తయారీ, అక్రమ ఎన్‌డీపీఎస్ మద్యం 934 లీటర్లు సీజ్ చేశాం. 23 నాటు సారా కేసులు నమోదు చేశాం. బెల్టు షాపులపై దాడులు చేసి నియంత్రిస్తాం. ఎవరినీ ఉపేక్షించేది లేదు.

– సుధీర్‌బాబు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, కర్నూలు

వ్యవసాయ డ్రోన్..!

● అన్నదాతల సరికొత్త ప్రయోగం ● డ్రోన్‌తో మందులకు పిచికారీ ● ఆసక్తిగా తిలకిస్తున్న రైతులు



డ్రోన్‌లోకి పురుగుమందు, నీరు కలుపుతూ..

మద్దికెర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పహారాలో సైనికుడిలా.. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులా.. భూముల కొలతలకు సర్వేయర్‌గా.. విపత్తులు సంభవించినప్పుడు సేవకుడిలా డ్రోన్ ఉపయోగపడుతుంది. ఇప్పుడు వ్యవసాయ పనుల్లో రైతుకూలిగా కూడా మారుతోంది. ఒకప్పుడు డ్రోన్ అంటే ఆశ్చర్యంగా చూశాం. తర్వాత డ్రోన్ సర్వాంతర్యామిగా మారిపోయింది. మొదట్లో ఏదో ఒక సందర్భంలోనే డ్రోన్‌ను వినియోగించేవారు. క్రమేణా వివాహాది శుభకార్యాలకు డ్రోన్ కెమెరా తప్పనిసరిగా మారింది. ఇప్పుడు డ్రోన్ విప్లవంలో మరో ముందడుగు పడింది. విదేశాల్లో మాత్రమే పంటలకు డ్రోన్‌ను వినియోగించేవారు.. ఇప్పుడు మారుమూల పల్లెల్లో సైతం పంటలకు డ్రోన్ ద్వారా పిచికారీ చేస్తున్నారు.

మద్దికెర మండలంలో దాదాపుగా 15 వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. కంది 5వేల ఎకరాల్లో, జొన్న 3వేల ఎకరాల్లో పంటలను సాగులో ఉంది. అయితే ఈ ఏడాది మంచి వర్షాలు కురవడంతో కంది పంట ఆరు నుంచి 7 అడుగుల ఎత్తు రాగా, జొన్న పంట 7 నుంచి 8 అడుగుల ఎత్తు రావడంతో తెగుళ్ల నివారణకు మందులు పిచికారి చేయడానికి ఇబ్బందులు పడుతుండేవారు. రైతులు ట్రాక్టరు ద్వారా మందు పిచికారీ చేస్తే పంటలు దెబ్బతింటాయనే ఆలోచనలో ఉండగా.. కొత్త ఆలోచనకు తెర తీశారు. అందులో భాగంగా డ్రోన్‌ను తెచ్చుకుని మందు పిచికారీ చేస్తున్నారు. ఎకరాకు రూ.400ల చొప్పున కూలీ ఇస్తూ మందులు పిచికారీ చేస్తున్నారు. అంతేగా తైవాన్ స్ప్రేయర్ ద్వారా మందులు పిచికారీ చేస్తే ఎకరాకు వెయ్యి లీటర్ల నీరు అవసరమవుతుంది. డ్రోన్‌తో అయితే కేవలం 10 నుంచి 15 లీటర్లు మాత్రమే అవసరమవుతోందని రైతులు తెలుపుతున్నారు. పంట ఏపుగా ఉండటం వల్ల మందు పిచికారీ చేయలేకపోతున్నారు. డ్రోన్‌కు చుట్టు ఆరువైపులా రెక్కలు ఉన్నాయి. నాలుగు రెక్కల ద్వారా మందులు పిచికారీ చేస్తున్నారు. దీంతో ప్రమాదం జరగకపోగా.. మందు పంట మొత్తానికి కలుస్తుందని తెలుపుతున్నారు. రైతుకు కూలీలు మిగలడమే కాకుండా నీరు కూడా ఆదా అవుతుందని అన్నారు. ఏది ఏమైనా రైతన్న పంట కోతకు యంత్రాలు ఎలా వాడుతున్నారో ఇప్పుడు పంటల పిచికారీ చేసేందుకు డ్రోన్‌ను వాడడం విశేషం. డ్రోన్‌తో పంటలు పిచికారీ చేయడాన్ని రైతులు ఆసక్తిగా తిలకించారు.



పంటల పిచికారి చేస్తున్న డ్రోన్‌ను తిలకిస్తున్న రైతులు

సమయం ఆదా అవుతోంది



డ్రోన్‌తో పంటలపై మందులు పిచికారీ చేయడం వల్ల సమయంతో పాటు నీరు కూడా ఆదా అవుతోంది. అంతేకాకుండా ఎలాంటి ప్రమాదాలు కూడా జరగవు. పంటల పిచికారీకి డ్రోన్ ఎంతో ఉపయోగపడుతోంది. అసలు డ్రోన్‌తో పిచికారీ అంటే నమ్మలేకపోతున్నాం.

–హరిబాబు, రైతు

పెట్టుబడులు తగ్గాయి



సహజంగా ఎకరాకు కూలీలను ఏర్పాటు చేసి మందులు పిచికారీ చేస్తే దాదాపు రూ.600 ఖర్చు వస్తోంది. డ్రోన్ కెమెరాతో మందులు పిచికారీ చేయడం వల్ల పెట్టుబడి బాగా తగ్గుతుంది.

– మల్లికార్జున, మద్దికెర

డ్రోన్ వినియోగం మంచిదే..



డ్రోన్ ఉపయోగించడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం. ఈ ఏడాది పంటలు ఏపుగా పెరిగాయి. మందులు పిచికారీ చేసే రైతులకు డ్రోన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతి ఒక్క రైతు ఉపయోగించుకోవాలి.

– ఉప్పర రవి, మండల వ్యవసాయాధికారి

మల్లన్న సన్నిధిలో తెలంగాణ మంత్రి సీతక్క



ఆలయ ప్రాంగణంలో తెలంగాణ మంత్రి సీతక్క

శ్రీశైలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ఆదివారం తెలంగాణ రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న మంత్రి సీతక్కకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో మంత్రి సీతక్కకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం

● మాజీ ఎమ్మెల్యే కాటసాని



మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలను మోసం చేయడం సీఎం చంద్రబాబునాయుడు నైజమని, విద్యుత్ చార్జీలు పెంచి ఆ పేరును మరొకమారు నిరూపించుకున్నారని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం నగరంలోని చెన్నమ్మకూడలిలోని తన స్వగృహంలో ఆయన సమావేశం నిర్వహించి టీడీపీ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా విద్యుత్ చార్జీలు ఎట్టి పరిస్థితుల్లో పెంచబోమని, వైసీపీ పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గిస్తానని ప్రజలకు బహిరంగసభల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో రెండు సార్లు ట్రూ అప్ చార్జీల పేరిట రూ.15485కోట్ల భారాన్ని మోపిందన్నారు. ప్రజలకు వైసీపీ అండగా ఉంటుందని, కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, విద్యుత్ చార్జీల తగ్గింపు కోసం పోరాడతామని చెప్పారు. డిప్యూటీ మేయర్ ఎస్.రేణుక, కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నాగలక్ష్మీరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, శివశంకర్‌రెడ్డి, సానా శ్రీనివాసులు, నరసింహులు ఉన్నారు.

పోలీసుల అదుపులో వెలుగోడు ఎంపీపీ

వెలుగోడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం నిల్వ, అక్రమ తరలింపు వ్యవహారంలో వైసీపీ నాయకుడు, వెలుగోడు ఎంపీపీ లాలం రమేష్‌ను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్టోబరు 8న ఎంపీపీకి రమేష్‌కు చెందిన జగదాంబ రైస్‌మిల్లులో పోలీసులు, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 20 ప్యాకెట్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ విషయంపై లాలం రమేష్‌ను ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్ రెడ్డి, వెలుగోడు ఎస్‌ఐ విష్ణునారాయణలు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎంపీపీ లాలం రమేష్‌పై గతంలో కూడా ఏడు కేసులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఆయనను విచారిస్తున్నామని, విచారణ అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దుర్గాభోగేశ్వర ఆలయంలో న్యాయాధికారి పూజలు



దుర్గాభోగేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ సిబ్బంది

గడివేముల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస చివరి రోజు పురస్కరించుకొని ఆదివారం మండలంలోని దుర్గాభోగేశ్వర ఆలయంలో దుర్గాభోగేశ్వరస్వామిని నంద్యాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి రాధారాణి దర్శించున్నారు. ఆమెకు ఆలయ అర్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ, ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దుర్గాభోగేశ్వరుడికి ఆమె పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం న్యాయాధికారికి అర్చకులు శాలువా కప్పి దుర్గాభోగేశ్వరుడిని చిత్రపటాన్ని అందజేశారు.

ఓపెన్ డ్రింకింగ్‌పై డ్రోన్ నిఘా

18 కేసులు నమోదు

కర్నూలు క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం(ఓపెన్ డ్రింకింగ్) సేవిస్తున్న వారిపై పోలీసులు డ్రోన్‌తో నిఘా ఉంచారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కర్నూలు నగరంలోని పలు ప్రాంతాల్లో నాలుగో పట్టణ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా డ్రోన్ కెమెరాలతో తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, నాలుగో పట్టణ ఎస్‌ఐ గోపినాథ్, ఆర్ఎస్ఐ హుసేన్‌లు చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా, డీమార్ట్ వెనుక ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేశారు. చెన్నమ్మ సర్కిల్ వద్ద ఏడుగురిని, కల్లూరు వక్కిలేరి వాగు వద్ద 11 మంది, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ మన్సూరుద్దీన్ వెల్లడించారు.

భక్తులపై తేనేటీగల దాడి

నలుగురికి గాయాలు



తేనేటీగల దాడిలో గాయపడిన వృద్ధురాలు పెద్దక్క

బేతంచెర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని కొలుములపల్లె రస్తాలో వెలసిన అంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులపై తేనేటీగల దాడి చేశాయి. ఆదివారం కార్తీకమాసం చివరిరోజు అమావాస్య కావడంతో ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసరాల్లో వృద్ధురాలు పెద్దక్క, మహేష్‌గౌడ్, మరో ఇద్దరు భక్తులపై తేనేటీగలు దాడి చేయగా.. అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆలయ నిర్వాహకులు అస్వస్థతకు గురైన భక్తులను వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పొలంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

మంత్రాలయం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలో రచ్చుమర్రి గ్రామానికి కిలో మీటరు దూరంలో చాకలి రామచంద్ర రైతు పత్తి పొలంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఆదివారం పొలంలోకి కూలీలు పత్తి తీసేందుకు వెళ్లిన కూలీలు దుర్వాసన రావడతో పరిశీలించా మహిళ మృతదేహం కనిపించింది. దీంతో మాధవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ విజయకుమార్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. 15 రోజుల క్రితం మహిళ మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి వయసు దాదాపు 40 నుంచి 45ఏళ్ల వరకు ఉండవచ్చని తెలిపారు. గుర్తు పట్టలేనంతగా శరీరం కుళ్లిపోయింది. మహిళ వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని మహిళ మృతదేహంగా కేసు నమోదు చేసి ఆదోనికి చెందిన డా.షాహీల్ అక్కడే పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్లు.. నిబంధనలకు చెల్లు..!

(5 వ పేజీ తరువాయి)

ఇంటి నిర్మాణదారులు అనుమతులు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ముందుగా ఇంటికి సంబంధించి ప్లాన్‌ను మున్సిపాలిటీ వారికి సమర్పించాల్సి ఉంటుంది. దీనికి సంబంధిత మున్సిపాలిటీ నుంచి లైసెన్స్ పొందిన ఇంజనీరు ద్వారా ప్లాన్ గీయించాల్సి ఉంటుంది. ఈ ప్లాన్ అందించేవారిని ఎల్‌టీపీ (లైసెన్సెడ్ టెక్నికల్ పర్సన్) అంటారు. ఏదైనా ఓ వార్డులో ఇంటి నిర్మాణం చేపట్టిన సంబంధిత యజమాని ఎల్‌టీపీలను సంప్రదించగానే ఆ వార్డు సచివాలయానికి ప్లాన్ పంపిస్తారు. దీనిని సదరు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ పరిశీలించి మునిసిపల్ అధికారులకు పంపుతారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, కొంతమంది ఎల్‌టీపీలు కుమ్మక్కై నంద్యాల పట్టణంలోని వార్డుల్లో నిబంధనలు సరిగా పాటించకుండా ఇంటి నిర్మాణం చేపట్టాలనుకునే వారి దరఖాస్తులు ఓ వార్డు సచివాలయానికి వెళ్లేలా పథకం పన్నినట్లు తెలుస్తోంది. సదరు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ దరఖాస్తులను పై అధికారులకు పంపించకుండా నిలిపివేస్తున్నాడని సమాచారం. అవి 15 రోజుల తర్వాత డీమ్డ్ కిందకు రావటం, మున్సిపాలిటీ నుంచి అనుమతులు రాకుండానే సదరు యజమానులు ఇంటి నిర్మాణాలను చేపడుతున్నారు. ఇలా అధికారులు, ఎల్‌టీపీలు, సచివాలయ సిబ్బంది అందరూ కలిసి అక్రమ నిర్మాణదారులకు వంత పాడుతున్నారని, సదరు వార్డు ప్లానింగ్ సెక్రటరీ లాగిన్ ఓ సారి పరిశీలిస్తే విషయమంతా బట్టబయలవుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

వివరాలు తెలియవా.. లేక దాచిపెడుతున్నారా?

నంద్యాల మున్సిపాలిటీ విభాగానికి వెళ్లి తమ ఇంటి నిర్మాణ అనుమతి దరఖాస్తు గురించి తెలుసుకోవాలంటే చుక్కలు చూడాల్సిందే! డబ్బులు ముట్టజెప్పారా.. అసలు మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లకుండానే అనుమతులు వచ్చేస్తాయి. లేదంటే.. 'దరఖాస్తు తాజా పరిస్థితి ఇంటర్నెట్‌లో చూసుకోండి' అని అధికారులు తాపీగా సమాధానమిస్తారు. అసలు పట్టణంలో అనుమతులు లేని నిర్మాణాలు ఎన్ని ఉన్నాయి? షాట్‌ఫాల్ దరఖాస్తులు ఎన్ని ఉన్నాయి? డీమ్డ్ దరఖాస్తులు ఎన్ని ఉన్నాయి? అని అడిగితే సైట్ తెరుచుకోనప్పుడు తమకు మాత్రం ఎలా తెలుస్తుందని దురుసుగా వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులకే సైటు తెరుచుకోనప్పుడు సామాన్యులకు ఎలా తెలుస్తుందన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయాన్ని కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు అడిగినా అధికారులు అనుమతులు లేని నిర్మాణాలు, షాట్‌ఫాల్, డీమ్డ్ దరఖాస్తుల వివరాలు తెలియవని చెబుతుండటం గమనార్హం. పట్టణంలోని ప్రతి ఇంటి నిర్మాణానికి సంబంధించిన వివరాలు అధికారులు, సిబ్బంది వద్ద ఉన్నాయని, కానీ అసలు విషయాన్ని బయటపెడితే తమ వ్యవహారం బయట పడుతుందన్న ఉద్దేశంతో వివరాలను దాచిపెడుతూ అక్రమ నిర్మాణదారులకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతి కంపు



నంద్యాల పట్టణంలో డీమ్డ్ దరఖాస్తులు దాదాపు 260కి పైగా ఉన్నాయి. కావాలనే అనుమతులు ఆలస్యం చేస్తూ వీటిని డీమ్డ్ కిందకు వచ్చేలా చేస్తున్నారు. ఈ తతంగమంతా మున్సిపాలిటీ అధికారులు, ఎల్‌టీపీ, ఓ వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ చేస్తున్నాడు. డీమ్డ్ కింద ఉన్న దరఖాస్తుదారులు ఇళ్లు కట్టుకుంటున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. సదరు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ లాగిన్ ఓ సారి పరిశీలిస్తే అసలు విషయాలు బయటపడతాయి. డబ్బులు ఇచ్చుకోలేని వారి దరఖాస్తులను షాట్‌ఫాల్ అంటూ వెనక్కు పంపుతున్నారు. ఇలాంటివి పట్టణంలో దాదాపు 200 వరకు ఉన్నాయి. నంద్యాల మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతి కంపు కొడుతోంది. సంబంధిత విభాగాన్ని ఉన్నతాధికారులు పరిశీలిస్తే అవినీతిపరులు బండారం బయటపడుతుంది. – మాబువలీ, నంద్యాల మున్సిపాలిటీ టీడీపీ ఫ్లోర్ లీడర్.

గోనెగండ్ల మోడల్ స్కూల్‌లో విద్యార్థికి పాముకాటు

ఆసుపత్రిలో చికిత్స

గోనెగండ్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ విద్యార్థి పాము కాటుకు గురయ్యాడు. అయితే ఈ ఘటన శనివారం జరిగినప్పటికీ ఉపాధ్యాయులు, సిబ్బంది సమాచారాన్ని గోప్యంగా ఉంచేందుకు యత్నించడంతో ఒకరోజు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని పెద్దనేలటూరు గ్రామానికి చెందిన దస్తగిరి కుమారుడు మాలిక్ బాషా గోనెగండ్ల మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ బైసీపీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పెద్దనేలటూరు నుంచి గోనెగండ్ల మోడల్‌స్కూల్‌కు వస్తూ ఉండేవాడు. శనివారం ఉదయం పాఠశాలలో ప్రార్థన ముగించుకుని తరగతి గదిలోకి వెళ్లాడు. అక్కడే టేబుల్ పక్కన ఉన్న పాము మాలిక్ బాషా కాలికి కాటు వేసింది. సమాచారం తెలుసుకున్న సిబ్బంది విద్యార్థిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎంఈవో రామాంజ నేయులు ఆసుపత్రికి వెళ్లి విద్యార్థిని పరామర్శించారు. డీఈఓ శ్యామ్యూల్ పాల్ విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై ఎంఈవోతో ఆరా తీశారు. ప్రస్తుతం విద్యార్థి మాలిక్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ఈ విషయంపై ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలలో పిచ్చిమొక్కలు, అపరిశుభ్రత ఉండటం వల్ల విషపురుగులు తిరుగుతున్నట్లు గుర్తించామన్నారు. వెంటనే పాఠశాలలో పారిశుధ్య చర్యలు చేపడతామన్నారు.

జిల్లా వ్యాప్తంగా కార్డెన్ సెర్చ్

31 బైక్‌లు స్వాధీనం, కేసులు నమోదు



నాటుసారా బట్టీని ధ్వంసం చేస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు తెల్లవారుజాము నుంచి పోలీసు అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 31 బైక్‌లను స్వాధీనం చేసుకుని పలువురిపై కేసు నమోదు చేశారు. అవుకు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొండమనా యునిపల్లె, సంజామల పరిధిలోని ఆల్వకొండ గ్రామం, పాణ్యం మండలం సుగాలిమెట్ట, వెలుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలోని రేగడగూడూరు గ్రామంలో ఏకకాలంలో అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించి సరైన ధ్రువపత్రాల్లేని 31 బైక్‌లు, 300 కిలోల బెల్లం, 80 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఆయా గ్రామాల్లోని నేరచరిత్ర గలవారికి, రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లకు గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు, గొడవలకు పాల్పడకుండా ఐకమత్యంతో సత్ప్రవర్తన కలిగి జీవించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఐదుగురు సీఐలు, 12 మంది ఎస్‌ఐలు, వందమంది పోలీసు సిబ్బంది, క్యూఆర్టీ పోలీసులు పాల్గొన్నారు.

జనవరి 5న హైందవ శంఖారావం

పాములపాడు డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జనవరి 5న విజవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు గిరిధర్, రఘురాం పిలుపునిచ్చారు. ఆదివారం పాములపాడు బ్రహ్మంగారి ఆశ్రమం ఆవరణలో విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి హిందువుల సమావేశం నిర్వహించారు.

ఆత్మకూరు రూరల్: అన్ని దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని హైందవ శంఖారావం మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ ఆచార్యులు, ప్రతినిధులు జి. సత్యనారాయణ, వేణుగోపాల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని జి.పుల్లారెడ్డి పాఠశాల ఆవరణలో జనవరి 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల స్థాయి హిందూ సమ్మేళనం నిర్వహించారు. హైందవ శంఖారావం తాలూకా కన్వీనర్ వాసుదేవ రెడ్డి, నాయకులు ఆవుల రెడ్డి, భానుమూర్తి, కృష్ణమూర్తి, వినోద్ కుమార్, కిరణ్‌కుమార్, సత్యనారాయణ, విశ్వరూపాచారి పాల్గొన్నారు.

సామూహిక ఆర్జిత అభిషేకాల వేదిక మార్పు

శ్రీశైలం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం ఆలయ ప్రాంగణంలో అక్కమహాదేవి మండప మరమ్మతుల నిర్వహణ రీత్యా అభిషేకాల నిర్వహణ ప్రస్తుతం స్వామి, అమ్మవార్ల కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నారు. ఇకపై సామూహిక ఆర్జిత అభిషేకాలు ఆలయ ప్రాంగణంలోని మూడు శివాలయాల వద్ద (సహస్ర దీపాలంకరణ సేవా మండపం వెనుక), అక్కమహా దేవి - హేమారెడ్డి మల్లమ్మ మందిరాల (నవబ్రహ్మ ఆలయాల ప్రక్కన) నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. గతంలో లాగే ఉదయం 6 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు, రాత్రి 7 గంటలకు సాముహిక ఆర్జిత అభిషేకాలు నిర్వహించనున్నారు. ఈ ఆర్జిత సేవా టికెట్లు ఒక్కొక్క విడతలో 100 టికెట్లు మాత్రమే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.

'పల్లె పండుగ నిధులతో గ్రామాభివృద్ధి'

ఆత్మకూరు రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ నిధులతో గ్రామాలు పురోభివృద్ధి చెందుతున్నాయని టీడీపీ మండల అధ్యక్షుడు శివప్రసాదరెడ్డి తెలిపారు. ముష్టపల్లి, సిద్దాపురం గ్రామాలకు ఏర్పాటు చేస్తున్న రహదారి, పలు అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. పంచాయతీరాజ్ ఏఈ సుబ్బయ్య, సిద్ధాపురం సర్పంచ్ పీట్ల వెంకటరమణ, టీడీపీ నాయకులు ఎస్తేరయ్య, పీట్ల బుజ్జి, సంజీవరావు, కాంట్రాక్టర్ ఉపేంద్రరెడ్డి ఉన్నారు.

'ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి'

ఆత్మకూరు రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదుట విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, సద్దాం హుసేన్, వీరన్న, కిరణ్, మహ్మద్, శివకుమార్, సామేలు, ముర్తుజా, నబిసా తదితరులు పాల్గొన్నారు.

6న జాబ్ మేళా

నందికొట్కూరు రూరల్ డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నంది కొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిసెంబరు 6వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంతరెడ్డి, ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. ఆదివారం జాబ్‌మేళా ప్లేయర్‌ను ఆవిష్కరించారు. పూర్తి వివరాల కోసం 9154830286, 9182217075 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

తాత్కాలిక హుండీ ఆదాయం లెక్కింపు

బండిఆత్మకూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో వెలసి ఉన్న ఓంకారంలో ఈవో ఆకృతి నాగప్రసాద్ ఆధ్వ ర్యంలో తాత్కాలిక హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆదివారం నంద్యాల గ్రూప్ దేవస్థానాల ఇన్‌స్పెక్టర్ హరిచంద్రారెడ్డి పర్యవేక్షణలో లెక్కించారు. కార్తీక మాసం నెల రోజుల హుండీ ద్వారా రూ.1,66,151 వచ్చిందని చెప్పారు. అర్చకులు మల్లికార్జున, సేవకులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. నలుగురికి తీవ్ర గాయాలు

పాణ్యం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తమ్మరాజుపల్లె సమీపం లోని అడ్డవాగు వంతెనను ఆటో ఢీకొన్న ఘటనలో నలుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న నంద్యా లకు చెందిన ఆటో అదుపుతప్పి అడ్డవాగు వంతెనకు ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. గాయపడిన వారిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించామని చెప్పారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన

బండిఆత్మకూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన ఉండాలని డాక్టర్ భావన సూచించారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకుని బండిఆత్మకూరులో ర్యాలీ ప్రారంభించారు.

ఆత్మకూరు రూరల్: ఎయిడ్స్ నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ ఆసియా మారుఫ్, మెరిబా సొసైటీ సభ్యులు జుల్ఫికర్ సూచించార. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకుని ఎయిడ్స్ నివారణపై ఆరోగ్య సిబ్బంది, మెరిబా స్వచ్ఛంద సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ మస్తానయ్య, ఆరోగ్య సిబ్బంది, మెరిబా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దోబీ ఘాట్లు లేక అవస్థలు

● పలుచోట్ల శిథిలమైన వైనం ● పనిచేయని బోరు మోటార్లు ● దయనీయంగా మారిన రజకుల జీవనం



ఆత్మకూరులో పని చేయని బోరు





ఆత్మకూరులో శిథిలమైన దోబీ ఘాట్లు, పట్టణ శివారులోని వాగులో దుస్తులు ఉతుకుతున్న దృశ్యం

ఆత్మకూరు రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో కులవృత్తిదారులకు గడ్డుపరిస్థితులు దాపరించాయి. ప్రభుత్వాలు ఆయా కులాల వృత్తిదారుల కోసం ఏటా కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తున్నప్పటికీ ఆశించినస్థాయిలో ప్రయోజనం చేకూరడం లేదు. దీంతో కులవృత్తిదారుల జీవనం భారంగా మారింది. ప్రత్యేకించి రజక వృత్తిదారుల పరిస్థితి మరీదారుణంగా ఉంది. కనీసం దోబీ ఘాట్ల విషయం పాలకులు, ప్రభుత్వ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ కోవలోనే ఆత్మకూరు మండలంలో వందల కుటుంబాలు రజక వృత్తిలో కొనసాగుతున్నాయి. అయితే మండలంలోని కురుకుంద, వెంకటాపురం, శ్రీపతిరావుపేట, కృష్ణాపురం, ఇందిరేశ్వరం, వడ్లరామాపురం తదితర గ్రామాల్లో దోబీ ఘాట్లను నిర్మించలేదు. దోబీ ఘాట్లు లేకపోవడంతో ఆయా గ్రామాల్లోని రజకులు దుస్తులు ఉతికేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని వాగులు, చెరువుల్లో ప్రమాదమని తెలిసినా దుస్తులను ఉతకాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల్లో సమయంలో తప్ప తమను గుర్తించేవారు లేరని రజకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు పట్టణంతో పాటు పలు గ్రామాల్లో గతంలో నిర్మించిన దోబీ ఘాట్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వేసవిలో వీరి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. పట్టణ శివారులోని పడేవాగులో ప్రస్తుతం పలువురు రజకులు దుస్తులు ఉతుకుతున్నప్పటికీ వేసవిలో నీరు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. అక్కడి బోర్ మోటారు పని చేయడం లేదు. ఆ బోర్ మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని రజకులు కోరుతున్నారు. అలాగే వడ్లరామాపురం రస్తాలోని వాగు సమీపంలో దోబీ ఘాటు నిర్మించాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని వాపోతున్నారు. బాపనంతాపురం గ్రామంలో ఏకంగా ఉన్న దోబీ ఘాట్‌ను తొలగించి అక్కడ వైసీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయాన్ని నిర్మించారు. దీంతో అక్కడి రజకులు సుదూరంగా ఉన్న వెలుగోడు రిజర్వాయర్‌కు వెళ్లి దుస్తులు ఉతకాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆదరణ పథకం కింద ఇస్త్రీ పెట్టె, టేబుళ్లు కావాలని దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం లేదని రజకులు వాపోతున్నారు. బీసీ కార్పొరేషన్ కింద రజకులు సొసైటీలుగా ఏర్పడి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అప్పట్లో రుణాలు రాజకీయ జోక్యంతో అంద లేదని వాపోయారు. ఇప్పటికైనా...ఈ కూటమి ప్రభుత్వంలో సంబంధిత అధికారులు స్పందించి రజకుల సమస్యలను తీర్చాలని కోరుతున్నారు.

దోబీ ఘాట్లలో సౌకర్యాలు కల్పించాలి



ఆత్మకూరు పట్టణంలో దోబీ ఘాట్ ప్రాంతంలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. అలాగే అక్కడి బోర్ మోటర్‌కు విద్యుత్ సౌకర్యం కల్పించాలి. అలాగే ఆదరణ పథకం కింద ఇస్త్రీ పెట్టె, టేబుళ్లు అందించాలి. బీసీ కార్పోరేషన్ కింద రుణాలు అందించి రజకులను ఆదుకోవాలి

- చందావారి వెంకటేశ్వర్లు, రజక వృత్తిదారుడు

సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి



రజకులకు గత వైసీపీ ప్రభుత్వంలో సబ్సిడీ రుణాలను ఇవ్వాలని అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదు. ఇప్పటి కూటమి ప్రభుత్వంలోనైనా బీసీ కార్పొరేషన్ సబ్సిడి రుణాలు బ్యాంకు ద్వారా కాకుండా సొసైటీల ద్వారా మంజూరు చేయాలి. రజకులకు 50 ఏళ్లకే పింఛన్ సౌకర్యం, ఇళ్ల స్థలాలు, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇవ్వాలి. ఇటీవల రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ తరహాలో ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి. ఈ కూటమి ప్రభుత్వంలోనైనా రజకుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి.

- సి.వెంకటేశ్వర్లు, రజక సంఘం నాయకుడు, ఆత్మకూరు

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలి

● మంత్రి ఎన్ఎండీ ఫరూక్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సర్వతోముఖాభి వృద్ధికి పాటుపడాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పిలుపునిచ్చారు. ఆదివారం నంద్యాలలోని నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో మాస్టర్ ఓరియంటల్ ప్రోగ్రామ్ నిర్వహించారు. నంద్యాల జోన్ పరిధిలోని గిద్దలూరు, నంది కొట్కూరు, మార్కాపురం, నంద్యాల జిల్లాలోని మూడు బ్రాంచ్‌ల విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తోపాటు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజేతలకు బహుమతు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఏజీఎం ప్రశాంత్, ఆర్ఐ చంద్రమౌళి, ప్రిన్సిపాళ్లు, కో ఆర్డినేటర్లు, ఏవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బలిజ వనభోజన మహోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు

నంద్యాల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణ శివారు ప్రాంతమైన మూలమఠంలో బలిజ వంశీయుల కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం కార్తీకమాసం చివరిరోజు కావడంతో వేలాదిమంది బలిజవంశీయులు తరలివచ్చి అక్కడ కొలువైఉన్న బీమలింగేశ్వరస్వామి, పరివార దేవతలకు కార్తీకదీపాలు వెలిగించి విశేష పూజలు జరిపించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉత్సవ కార్యక్రమాన్ని అతిదులుగా వచ్చిన ఆర్‌జీఎం విద్యాసంస్థల అధినేత మిద్దె శాంతిరాముడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు, వర్ధంశెట్టి రాజారాం ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. లాటరీ పద్ధతి ద్వారా ఎంపికైన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

సారా బట్టీలపై దాడులు

పాణ్యం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సుగాలి మెట్ట ప్రాంతంలో ఆదివారం పాణ్యం సీఐ కిర ణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఒకరిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత కోరారు. ఆదివారం పాణ్యం టీడీపీ కార్యాలయంలో ఆమెతో పాటు టీడీపీ నాయకులు గౌరు వెంకటరెడ్డి కార్యకర్తలతో సహావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాణ్యం మండలంలో 17 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఎస్సార్బీసీ కాలువ ఆధ్వర్యంలో ఉండగా చిన్ననీటిపారుదల కింద ఆరు చెరువులకు సంఘాలు ఉన్నాయన్నారు. ఈనెల 8వతేదీన జరిగే ఎన్నికల్లో సభ్యులు సంఘ సభ్యులను ఎన్నుకొని రైతుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. టీడీపి సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని నాయకులను ఆదేశించారు. మైనర్ ఇరిగేషన్ డీఈ నాగన్న, కాడా డివిజన్ జేఈ చంద్రుడు, సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ నరేంద్రనాథెడ్డి, ఎంపీటీసీ భాస్కరరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ జయరామిరెడ్డి, నియోజకవర్గ యువజన నాయకులు గౌరు జనార్దనరెడ్డి, మాజీ ఎంపీటీసీ తిరిపాలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కార్తీక మాసం పురస్కరించుకొని కొత్తూరు దేవస్థానంలో ఆదివారం ఎమ్మెల్యే గౌరు చరిత, ఆమె తనయుడు గౌరు జనార్దనరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో రామకృష్ణ ఎమ్మెల్యేకు స్వాగతం పలికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు నారాయణ స్వామి, సురేష్ శర్మ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు



టేబుల్ టెన్నిస్ విజేతలతో అతిథులు

నంద్యాల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నంద్యాలలోని ఇండోర్ స్టేడియంలో రెండురోజులుగా జరిగిన రాష్ట్ర స్థాయి 68వ స్కూల్‌గేమ్స్ బాల, బాలికల అండర్-14టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారం ముగిశాయి. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవానికి టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, నంద్యాల క్రీడాసమాఖ్య గౌరవాధ్యక్షుడు డా.రవికృష్ణ, ఎస్జీఎఫ్ టేబుల్ టెన్నిస్ రాష్ట్ర పరిశీలకులు దుర్గాప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు మెమెంటోలు, మెడల్స్, ప్రశంసా పత్రాలే అందజేశారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి శ్రీనాథ్, శాప్ టేబుల్ టెన్నిస్ కోచ్ ముంతాజ్, ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏపీరెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర, నాగరాజు, టోర్నమెంట్ టెక్నికల్ అడ్వయిజర్ విశ్వనాథ్, సీనియర్ పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

'ఆలయాలు ధర్మానికి వారధిగా ఉండాలి'



శివయోగేంద్ర సరస్వతి స్వామిని శాలువాతో సన్మానిస్తున్న ఈవో

మహానంది, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆలయాలు, క్షేత్రాలు ధర్మానికి వారధిగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు కాకనూరు శారదా పీఠం పీఠాధిపతులు శివయోగేంద్ర సరస్వతి స్వామి తెలిపారు. ఆదివారం కార్తీక అమావాస్య సందర్భంగా మహానంది క్షేత్రంలో పూజలు నిర్వహించేందుకు పీఠాధిపతి శిష్యులతో వచ్చారు. ప్రధాన ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం కల్యాణ మంటపంలో వేదపండితులు వీరిని ఆశీర్వదించి ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి శాలువాతో సన్మానించారు.

పెద్దదేవళాపురంలో ఎమ్మెల్యే బుడ్డా



ఎమ్మెల్యే బుడ్డాకు మెమెంటో అందిస్తున్న నిర్వాహకులు

బండిఆత్మకూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పెద్ద దేవళాపురం ఏకశిలా అభయాంజనేయుడిని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు శివరాజునాయక్ ఆధ్వర్యంలో అర్చకులు స్వామికి ఆకు పూజ, అర్చనలు చేశారు. ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. నిర్వాహకులు స్వామి మెమెంటోను, తీర్థ ప్రసాదాలు ఎమ్మెల్యేకు అందజేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కేసీ కెనాల్ ఈఈ ప్రతాప్, టీడీపీ నాయ కులు మల్లేశ్వరరెడ్డి, మండల యూనిట్ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు, సర్పంచ్ పెద్దన్న, రామలింగం, ప్రసాద్, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో, మండల పరిధిలోని శ్రీపతిరావుపేట గ్రామ శివార్లలో వెలిసిన పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

పగిడ్యాల: కొత్తముచ్చుమర్రిలోని ఆంజనేయస్వామి ఆలయంలో అమావాస్య పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మిడుతూరు: రోళ్లపాడు అభయ అరణ్యంలో వెలసిన బరక సంజీరాయ స్వామికి ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త పేరెడ్డి మురళి మోహన్ రెడ్డి, పురోహితుడు నరహరిశర్మ ఉన్నారు. మిడుతూరు సమీపంలోని సమ్మర్ స్టోరేజ వద్ద వెలసిన బాల ఆంజనేయ స్వామికి పూజారి మధు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముగిసిన కార్తీక మాసోత్సవాలు



మహానందిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మహానంది, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో కార్తీకమాసం ముగింపు పురస్కరించుకొని వేలాదిమంది భక్తులు ఆదివారం పూజలు నిర్వహించేందుకు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలోని రుద్రగుండం కోనేరుతో పాటు రెండో ప్రాకారంలోని పూల కోనేర్లల్లో వేకువజాముననే కార్తీక పుణ్యస్నానాలు ఆచరించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో ఆలయం ముందు భాగంలోని ధ్వజస్తంభంతో పాటు నాగులకట్ట వద్ద దీపాలు వెలిగించారు. పరమశివుడి దర్శనం కోసం తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో మహానది క్షేత్ర పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. దర్శనార్థమై క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం గరుడ నంది ఆలయం వద్ద దేవస్థానం భజన గురువు రాముడుగౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. వివిధ సేవల ద్వారా రూ.లక్షలాది ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

గడివేముల: కార్తీకమాస చివరి రోజు సందర్భంగా పైబోగుల సమీపంలో ఏడు ఊర్ల గవి భక్తులతో కిటకిటలాడింది. గవిలో ఉన్న గంగా ఉమా సమేత సర్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా వచ్చిన భక్తులకు మాజీ ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



కొత్తపల్లి: తాండవ మల్లేశ్వస్వామి ఆలయంలో కార్తీక వన భోజనంలో పాల్గొన్న భక్తులు

నందికొట్కూరు రూరల్: కార్తీక మాసం చివరి రోజున నందికొట్కూరులోని వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో ఆర్యవైస్యసంఘం ఆధ్వర్యంలో తులసీ దామోదర స్వామి కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. కార్తీ మాస వనభోజనం ఏర్పాటు చేశారు. పట్టణ ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘం పెద్దలు పాల్గొన్నారు.



నందికొట్కూరు రూరల్: నందికొట్కూరులో తులసీదామోదర స్వామి కళ్యాణం





పగిడ్యాల: ప్రాతకోటలో లక్ష బిల్వార్చనలో పాల్గొన్న భక్తులు, పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

కొత్తపల్లి: కొత్తపల్లి తాండవ మల్లేశ్వరస్వామి ఆలయంలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న కార్తీక మాస ప్రత్యేక పూజలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజున గ్రామస్థుల సహకారంతో ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున వన భోజన కార్యక్రమం చేపట్టారు.



ఆత్మకూరు రూరల్: రుద్ర కోటేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పగిడ్యాల: తూర్పు ప్రాతకోట గ్రామంలోని గంగా పార్వతి నాగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీకమాసం చివరి రోజును పురస్కరించుకొని ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనతరం భక్తులకు వనభోజనం ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మండల కన్వీనరు పలుచాని మహేశ్వరరెడ్డి, బీజేపీ శంకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల కల్చరల్: మహాదేవునికి పవిత్ర కార్తీక మాసం పురష్కరించుకొని నంద్యాల పట్టణంలోని కోదండ రామాలయం ప్రాంగణంలో ఆదివారం రాత్రి ఘనంగా కాశీ విశాలక్ష్మి దేవికి కుంకుమార్చన నిర్వహించారు. ఈ ఏడాది ప్రథమంగా స్వామి వారికి నిత్య భక్తుల సహకారంతో భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో రుద్ర పఠనం చేస్తూ పుష్పాభిషేకం భక్తిశ్రద్ధలతో అర్చకులు నిర్వహించారు.



గడివేముల: ఏడు ఊర్ల గవిలో పూజలు చేస్తున్న భక్తులు



నంద్యాల కల్చరల్: నంద్యాలలో పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం నిర్వహిస్తున్న రుత్వికులు

● నంద్యాల పట్టణంలోని బసవేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణంను రుత్వికులు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ఆత్మకూరు రూరల్: నల్లమల అభయారణ్యంలో వెలిసిన రుద్రకోటేశ్వరాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిట లాడింది. ఈ సందర్భంగా ఆలయంలో వెలసిన రుద్రాణి సహిత రుద్రకోటేశ్వర స్వామి అమ్మవార్లకు ప్రాతఃకాల సమయంలోనే ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేశారు. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు రాఘవరావు ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

యువత క్రీడల్లో రాణించాలి : బీసీ రాజారెడ్డి


క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో ఆదివారం క్రీడాకారులకు ఉచితంగా క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలన్నారు. యువత మత్తు పానీయాలు, గంజాయి తదితర వాటికి బానిసలు కాకుండా మంచిమార్గంలో నడవాలన్నారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు సైతం సాధించవచ్చన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

అల్లర్లు సృష్టిస్తే గ్రామ బహిష్కరణ: సీఐ

బేతంచెర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో రౌడీషీటర్లు ఘర్షణలకు పాల్పడి ప్రజాశాంతికి భంగం కలిగిస్తే గ్రామ బహిష్కరణ చేస్తామని సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

బేతంచెర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : లైసెన్సు లేకుండా వాహనాలను నడిపితే చర్యలు తప్పవని ఆటో డ్రైవర్లను సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం రాత్రి పట్టణంలోని పాతబస్టాండులో ఆటోలను, ద్విచక్రవాహనాలను సీఐ తనిఖీ చేశారు. పలు వాహనాల డ్రైవర్ల లైసెన్సులు వాహనానికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. వాహనాలకు లైసెన్సులు, ఆర్‌సీలు లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవని హె చ్చరించారు. తనిఖీల్లో ఎస్ఐ రమేష్ బాబు, పోలీసు సిబ్బంది ఉన్నారు.


ఆటోను తనిఖీ చేస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

చాగలమర్రికి చేరిన రైతు యాత్ర


ఎద్దులబండి యాత్రకు స్వాగతం పలుకుతున్న టీడీపీ, జనసేన కార్యకర్తలు

చాగలమర్రి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను సీఎం, డిప్యూటీ సీఎంకు తెలుపుకునేందుకు రైతు ఎద్దులబండి యాత్ర చేపట్టినట్లు రైతు నవీన్‌కుమార్ తెలిపారు. ఆదివారం చాగలమర్రిలో రైతు ఎద్దులబండి యాత్ర చేశారు. రైతుకు టీడీపీ కార్యకర్తలు మాబుపీరా, మాబాష, జనసేన కార్యకర్తలు శివబాలాజీ స్వాగతం పలికారు. సత్యసాయి జిల్లా సాతనకోట గ్రామం నుంచి గత నెల 18న ఎద్దుల బండి యాత్ర ప్రారంభించారు. గుత్తి, ప్యాపిలి, డోన్, బనగానపల్లె, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ మీదుగా చాగలమర్రికి చేరుకుంది. మరో 20 రోజుల్లో అమరావతికి చేరుకొని రైతుల సమస్యలసటపై సీఎం, డిప్యూటీ సీఎంలకు వినతి రూపంలో తెలియజేస్తామని అన్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

కోవెలకుంట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ బీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన ఎంపీడీవో వర ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. 11.30గంటలకు ప్రారంభమైన సమావేశంలో తహసీల్దారు పవన్ కుమార్‌రెడ్డి, ఎంఈవో వెంకట్రామిరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ విద్యాసాగర్, వ్యవసాయాధికారి నిరంజన్, పశువైద్యాధికారి క్రిష్ణకుమార్, ఎన్ఆర్ ఈ జీఎస్ శ్రీవిద్య, పీఆర్ఏఈ విద్యుత్ ఏఈ రా మ్మోహన్‌రెడ్డితో పాటు పలువురు అధికారులు ప్రగతి నివేదిక చదివి వినిపించారు. ప్రజా ప్రతినిధులు సమస్యలపై ఏమీ మాట్లాడకపోవడంతో సభ ఒంటిగంటకు ముగిసింది. సమావేశంలో ఎంపీటీసీలు బాబమ్మ, కత్తిసురేశ్, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, ఈవోఆర్డీ ప్రకాశ్ నాయుడు, హార్టికల్చర్ అధికారి ధరణి, సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులో యాంటీ రేబీస్ వ్యాక్సిన్లు

కొలిమిగుండ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల ప్రభుత్వ వైద్యశాలలో కుక్క కాటుకు సంబంధించి యాంటీ రేబీస్ టీకాలు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వ వైద్యుడు హరిచరణ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఇటీవల కుక్కల బెడద అధికంగా మారిందని గత నెల రోజుల వ్యవధిలోనే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 36మంది కుక్కల దాడికి గురైనట్లు ఆయన తెలిపారు. వీరికి ప్రభుత్వ వైద్యశాలలోనే చికిత్స నిర్వహించి టీకాలు వేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని సూచించారు.

కొండమనాయునిపల్లెలో కార్డెన్ సెర్చ్


పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటుసార, బెల్లం

అవుకు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమనాయునిపల్లె గ్రామంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించినట్లు బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అవుకు, నందివర్గం ఎస్ఐలు రాజారెడ్డి, వెంకటసుబ్బయ్య, పోలీస్ సిబ్బందితో కలసి కొండమనాయునిపల్లె గ్రామంలో తనిఖీ చేపట్టారు. సోదాల్లో 300 కేజీల బెల్లం, 50 లీటర్లు నాటుసారా, సరైన పత్రాలు లేని 20 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామస్థులతో సమావేశాన్ని నిర్వహించి నాటుసారాతో కలిగే నష్టాలను వివరించామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం

చాగలమర్రి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. ఆదివారం చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రామతీర్థం, వీరయ్య, సుబ్బరాయుడు, లాలయ్య, సిద్ధప్ప, పుల్లయ్య, చిన్నికృష్ణయ్య, దస్తగిరి పాల్గొన్నారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ

డోన్ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లెప్రసీ కాలనీలో ప్రార్థన సమయం నిర్వాహకులు జానీ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం క్రిస్మస్ కానుకల పంపిణీ చేశారు. అనంతపురం జిల్లా హిందూపురం చెందిన వరదరాజుల దంపతుల ఆర్థిక సహకారంతో చీరల పంపిణీ చేసినట్లు జానీ ప్రభాకర్ తెలిపారు.

దోబీ ఘాట్ నిర్మాణానికి సహకారం: మంత్రి

బనగానపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో రజకులకు దోబీ ఘాట్ నిర్మాణానికి సహకారం అందిస్తానని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో రజక సంఘం నాయకులు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను సానుకూలంగా విన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.


మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డిని సన్మానిస్తున్న మండిమర్చంట్ అసోసియేషన్ సభ్యులు

● మండిమర్చంట్ అసోసియేషన్ సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం కోవెలకుంట్ల మండిమర్చంట్ అసోసియేషన్ సభ్యులు మంత్రి బీసీని కలిసి సత్కరించారు. తమ సమస్యలను పరిష్కరించాలని మంత్రి బీసీని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టంగుటూరు శీనయ్య, కోవెలకుంట్ల మండిమర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీ ప్రసాద్, ఉపాధ్యక్షుడు రాంకుమార్, సెక్రటరీ నాగభూషణం, సభ్యులు పాల్గొన్నారు.


మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, దంపతులను సన్మానిస్తున్న రజక సంఘం నాయకులు

మంత్రి ఆర్థిక సహాయం

బాధితులకు బీసీ జేఆర్ వెల్ఫేర్ ట్రస్టు అండగా ఉంటుందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బనగానపల్లె పట్టణానికి చెందిన షేక్ మహమ్మద్‌రఫీ ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కిందపడి రెండు కాళ్లు విరిగాయి. బాధితకుటుంబానికి ఆదివారం బీసీ జేఆర్ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో కార్మిక బీమా పథకం కింద ట్రస్టు చైర్మన్ , రోడ్డు భనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రూ. 20 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

ఎయిడ్స్ భూతాన్ని తరిమికొట్టాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రావతి

శిరివెళ్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : భావితరాల మనుగడకు గొడ్డలిపెట్టుగా మారిన ఎయిడ్స్ భూతాన్ని తరిమికొట్టాలని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రావతి పిలుపునిచ్చారు. ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ఆదివారం కళా శాలలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ యువత బాధ్యతగా మెలగాలన్నారు. అనంతరం విద్యార్థినులకు నిర్వహించిన రంగోలి పోటీల్లో ప్రతిభ చూపిన సోమియా, రాజేశ్వరిలను అభినందించి బహుమతులు పంపిణీ చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ కృష్ణమూర్తి, అధ్యాపకులు సంజీవ కుమార్, గాయత్రి, రేఖ సిబ్బంది పాల్గొన్నారు.



యర్రగుంట్లలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఇంద్రావతి

కోవెలకుంట్ల : ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా పట్టణంలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో విక్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహార కిట్లు అందించారు. కార్యక్రమంలో విక్కీ ఫౌండేషన్ అధ్యక్షులు గోపిరెడ్డి పరమేశ్వర్‌రెడ్డి, ఐసీటీసీ కౌన్సిలరు శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్యాపిలి: ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి వాణిశ్రీ అన్నారు. జాతీయ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి బారిన పడకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బనగానపల్లె: మండలంలోని టంగుటూరు గ్రామంలో టంగుటూరు వైద్య అధికారి డాక్టర్ శివశంకరుడు, సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సరస్వతి, సిబ్బంది శివశంకర్‌గౌడ్, రమేశ్, ప్రభావతి, తులసి ల్యాబ్ టెక్నీషియన్ హసీన, అరుణ, ఆశాకార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


కోవెలకుంట్ల ఆసుపత్రిలో బాధితులకు పౌష్టికాహార కిట్లను అందిస్తున్న వైద్యుడు



ప్యాపిలిలో ఎయిడ్స్‌పై ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

అలరించిన కృష్ణవేణి సంగీత నీరాజనం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన దిగువ అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కృష్ణవేణి సంగీత నీరాజనం భక్తులను అలరించింది. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో విదూషి విద్వన్మణి కుమారి దీపిక వరదరాజన్ బృందం తమ కచేరితో ఎంతగానో ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ రాజకుమారి గనియా, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో నాట్య, మ్యూజికల్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అహోబిలంలో రోప్‌వే పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మఠం నిర్వాహకులు, పర్యాటకశాఖ అధికారులు పాల్గొన్నారు.


హాజరైన కలెక్టర్ రాజకుమారి గనియా, ఎమ్మెల్యే అఖిలప్రియ



కచేరి నిర్వహిస్తున్న కుమారి దీపిక వరదరాజన్

6న ఆళ్లగడ్డలో జాబ్ మేళా

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రోత్సాహంతో ఈనెల 6న ఆళ్లగడ్డ పట్టణంలోని అనంత డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ అనంత రామసుబ్బారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్ మేళాలో ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు జిరాక్సులతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో రావాలని తెలిపారు. జాబ్ మేళాకు సంబంధించిన వివరాల కోసం మాధవ కృష్ణయ్య 9701303790, రామాంజనేయులు 8790895790 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు ఆలయంలో బహిరంగ వేలం

శిరివెళ్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలోని సర్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో సోమవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి బీవీ నరసయ్య ఆదివారం తెలిపారు. ఆలయం వద్ద తినుబండారాలు, బొమ్మలు, టెంకాయలు, ఐస్‌క్రీమ్స్ తదితర వాటిని విక్రయించుకునేందుకు, భక్తులు స్వామి వారికి సమర్పించే తలనీలాలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కును పొందేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఏడాది కాలపరిమితితో ఈ వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నిర్ణీత సొమ్మును డిపాజిట్‌గా చెల్లించి వేలంలో పాల్గొనాల్సి ఉంటుందని.. హెచ్చుపాటదారుడు నగదు మొత్తాన్ని చెల్లించి రశీదు పొందాలని ఈవో తెలిపారు.

వైభవంగా పడిపూజ దీపోత్సవం

చాగలమర్రి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని ఏకశిలా పదునెట్టాంబడి అయ్యప్ప ఆలయంలో ఆదివారం పడిపూజ దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గణపతిహోమం చేశారు. మాలధారులు, చిన్నారులు దీపాలతో ఊరేగింపు చేశారు. ఆలయంలో 108 కలశాలతో క్షీరాభిషేకం, చందన అలంకారంతో అయ్యప్పకు ప్రత్యేక పూజలు చేశారు. 18 మెట్లపై దీపాలు వెలిగించి పడిపూజ నిర్వహించారు. గురుస్వాములకు కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు జనార్ధన్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.


చాగలమర్రి అయ్యప్ప ఆలయంలో క్షీరాభిషేకం చేస్తున్న మాలధారులు

ఘనంగా కార్తీక అమావాస్య పూజలు

మొక్కులు తీర్చుకున్న భక్తులు


చాగలమర్రి పాత శివాలయంలో అన్నాభిషేకం అలంకారంలో కొలువుదీరిన ఈశ్వరస్వామికి పూజలు చేస్తున్న మహిళలు


కొలిమిగుండ్ల: పూజలందుకుంటున్న కాలభైరవస్వామి


ఆంజనేయస్వామికి పూజ చేస్తున్న భక్తులు

చాగలమర్రి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయంలో కార్తీక అమవాస్య పూజలను ఆదివారం మహిళలు సామూహికంగా ఘనంగా నిర్వహించారు. సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ఈశ్వరస్వామిని అన్నాభిషేకం అలంకారంలో పార్వతిదేవికి సామూహిక ఒడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. విష్ణు సహస్ర పారాయణం, లలితా పారాయణం, నిర్వహించి శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. 108 దీపాలతో దీపోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : మండలకేంద్రమైన కొలిమిగుండ్ల లక్ష్మీనృసింహ కొండపై వెలిసిన కాలభైరవ స్వామికి కార్తీక మాసం ముగింపు, ఆదివారం అమావాస్య పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పేరం బయ్యపురెడ్డి, నందకిశోర్ రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యం లో కాలభైరవ స్వామికి విశేష పూ జలు, అభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు మహే ష్ శర్మ తెలిపారు.

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామ మెట్టవద్ద వెలసిన అభయ ఆంజనేయస్వామికి ఆదివారం కార్తీక బహుళ అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని అర్చకుడు కీర్తి లక్ష్మణస్వామి అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి గణపతి, ఆకు పూజలు చేశారు. కడప జిల్లా పొద్దుటూరు పట్టణ ఎస్సై సంజీవరెడ్డి స్వామి వారిన దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి హారతి ఇచ్చి నైవేద్యం సమర్పించారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

రుద్రవరం : రుద్రవరంలో పడమటివీధిలో కొలువుదీరిన ప్రతాపరుద్ర ఆంజనేయస్వామికి ఆదివారం అమావాస్య పూజలు చేశారు. అర్చకులు వారణాసి గోపిశర్మ అభిషేకం చేసి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అయ్యప్పస్వామి కమిటీ ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేశారు.

భగవద్గీతను చదవాలి

కొలిమిగుండ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హిందువుల పరమ పవిత్ర గ్రంథం భగవద్గీతను ప్రతి ఒక్కరూ చదవాలని త్రైతసిద్ధాంతం, ఇందు జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు సూచించారు. ఆదివారం కొలిమిగుండ్ల మండలంతో పాటు, సంజామల మండలం నొస్సం తదితర గ్రామాల్లో భగవద్గీత గొప్పతనంపై విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కొలిమిగుండ్ల కమిటీ సభ్యుడు బాబు, కొలిమిగుండ్ల, సంజామల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బనగానపల్లె: మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి జ్ఞానవేదిక ధర్మవరం కమిటీ సభ్యులతో ప్రచారం చేశారు. కార్తీక దీపంలో కార్తీక దీపాలు వెలిగించడం అందులోని జ్ఞానాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, మద్దిలేటి, వెంకటేశ్, పరశురాముడు, మహేశ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

5న హైందవ శంఖారావం సభ

కొలిమిగుండ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈనెల 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం మహాసభకు హిందూ సోదరులు తరలిరావాలని సభ కో- కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. ఆదివారం కొలిమిగుండ్ల సా యిబాబా ఆడిటోరియంలో శంఖారావం సభపై హిందూ సమ్మే ళనం కార్యక్రమాన్ని సమరసత, విశ్వహిందూ పరిషత్ ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు, సభ్యులు పాల్గొన్నారు.

సంజామల: హైందవ శంఖారావడం సభను జయప్రదం చేద్దామని ఆర్ఎస్ఎస్ విభాగ ప్రచారక్ దాసరి శ్రీనివాసులు కోరారు. ఆదివారం మండల కేంద్రమైన సంజామల వనం వెంకటేశ్వరస్వామి ఆలయంలో 13 గ్రామాల హిందువులతో కలిసి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్.ఎస్.ఎస్ సామాజిక కార్యకర్తలు రఘురామయ్య యాదవ్, శివనారా య ణ రెడ్డి, ఆయా గ్రామాల హిందువులు పాల్గొన్నారు.

రుద్రవరం: హైందవ శంఖారావాన్ని విజయవంతం చేసి హిందువుల ఐక్యతను చూపుదామని విశ్వహిందూపరిషత్ ఉపాధ్యక్షుడు నాగరాజు అన్నారు. ఆదివారం రాత్రి రుద్రవరం మండల గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో శివప్రసాద్, మండల ప్రచారక్ లక్ష్మీనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జిల్లా మహాసభలను జయప్రదం చేయండి'

డోన్ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరులో ఈ నెల 9, 10 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని డోన్ సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు కొండయ్య, శివరాం, నాగమద్దయ్య, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

కోవెలకుంట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ కోఆప్షన్‌మెంబరు ఎస్ఏ గఫూర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ టీడీపీ సభ్యత్వం తీసుకొని వాటి వల్ల వచ్చే ప్రయోజనాలు పొందాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగుల దినోత్సవం

కోవెలకుంట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 3న దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు దివ్యాంగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు తెలిపారు. కార్యక్రమానికి టీడీపీ నాయకురాలు ఇందిరమ్మ, కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి, జిల్లా ఎస్పీ ముదిరాజ్‌సింగ్‌రాణి తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమాజంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు.

8న సాగునీటి సంఘాల ఎన్నికలు

చాగలమర్రి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలోని 15 సాగునీటి సంఘాలకు 8న ఎన్నికలు జరుగుతాయని టీజీపీ డీఈ వెంకటరమణ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ టీజీపీ పరిధిలో 171టీసీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని అన్నారు. 5న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు. సిబ్బందిని కూడా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సాగునీటి సంఘాల టీసీలకు సంబంధించిన ఓటర్ల జాబితాను రెవెన్యూ అధికారులు సిద్ధం చేస్తారని అన్నారు. 33 బ్లాక్ నుంచి 47 బ్లాక్ వరకు డబ్ల్యూఎల్ టీసీలకు ఎన్నికలు జరుగుతాయని అన్నారు. ఎన్నికలు పకడ్బం దీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

4న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాక

ప్యాపిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఈనెల 4న మండలానికి రానున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రంగనాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం యురేనియం తవ్వకాల కొరకు టెండర్లు నిర్వహించిన జక్కసానికుంట్ల గ్రామంలో పర్యటించనున్నట్లు తెలిపారు. జక్కసానికుంట్లతో పాటు సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని రామక్రిష్ణ పర్యటనను విజయవంతం చేయాలని రంగనాయుడు కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే రాధాక్రిష్ణ, మండల కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రంలో కృంగిన బండలు


ఆరోగ్య ఉపకేంద్రంలో పగిలిన టైల్స్

రుద్రవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యల్లావత్తుల గ్రామంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం శిథిలమైంది. గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. లోపలి భాగంలో ఉన్న టైల్స్ పగిలాయి. మరో గదిలో టైల్స్ కృంగిపోయాయి. ఇక్కడ విష సర్పాలు సంచరిస్తుండడంతో ఆరోగ్యసిబ్బంది ఆందోళన చెందుతున్నారు. కిటికీలకు చెదలు పట్టాయి. గోడలకు పగుళ్లు ఏర్పడడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఈ విషయంపై యల్లావత్తుల ఆరోగ్య ఉప కేంద్రం ఎంఎల్ హెచ్‌పీ శాంతి మాట్లాడుతూ టైల్స్ పగిలిపో యాయి. బండపరువు కృంగిపోయింది. ఈ విషయాన్ని ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.


యల్లావత్తులలో ఆరోగ్య కేంద్రంలో కృంగిన బండలు